స్కెచ్

# అర్ధరూపాయి అప్పు

తంత్రవహి వెంకట్రావు

నా మిత్రుడు చిదంబరం నాకొక అర్ధరూపాయి బాకీ పడ్డాడు. అతనప్పుడే అది అప్పు తీసుకుని మూడుసంవత్సరాలు దాటుతోంది. అంటే చట్టరీత్యా కాలదోషం పడుతోందన్నమాట.

అతనిలో ఆ బాకీతీర్చేలక్షణాలేవీ మచ్చుకు కూడా కనిపించటంలేదు. తను నాకొక అర్ధరూపాయి బాకీ వున్నాడన్న సంగతి పూర్తిగా మరచిపోయి వుంటాడని అతన్ని కలుసుకున్నప్పుడల్లా అనుకుంటూంటాను. అనుకోవటమే కాదు. నిజానికంతే!

కాని అతను నన్ను ఎప్పటిలాగ నిర్మల ప్రేమతో ప్రేమిస్తాడు. నిష్కాపటంగా పలుకరిస్తాడు. ఆ అర్ధరూపాయి మా యిద్దరి స్నేహానికి అడ్డురాలేదు. రాదుకూడా. కాని ఆ అర్ధరూపాయి సంగతిమాత్రం తను పూర్తిగా మరచిపోయాడు. నా అర్ధరూపాయి తిరిగి నన్ను చేరేగీత నా జాతకంలో యికలేదు.

వెధవ అర్ధరూపాయి. దీనికింతగోల దేనికంటారేమో? అది కాదు నా లక్ష్యం.

అర్ధరూపాయి అంటే యెనిమిదణాలు, అంటే ముప్ఫయిరెండు కానులు, అంటే ముప్ఫయిరెండు యింటూ మూడు పైసలు అని లెక్కకట్టే రకం కాదు నేను.

అతను అర్ధరూపాయి అప్పుగా తీసుకున్నాడు. అప్పు అన్న తర్వాత అప్పే. అప్పు అనగానే మళ్ళీ మనం తీర్చవలసిన బాధ్యతవుందని అర్థం.

ఏమయినా నేనుమాత్రం నాకొక అర్ధరూపాయి చిదంబరంవద్దనుండి రావలసి వుందని బ్రతికున్నంత కాలం మరచిపోలేను, ఆ తర్వాతసంగతి నాకు తెలీదుకాని...

దీనివల్ల మా సన్నిహిత స్నేహం చెడిపోతుందని భయంలేదు. కాని నేనుమాత్రం ఆ "వ్యాపారం" నిద్రలోకూడా మరచిపోలేను.

ఇతరుల విషయం చెప్పలేనుగాని, నాకెవరన్నా ఒక అర్ధరూపాయి కాదు, అణాకాను బాకీ వున్నా, అంటే యెవరైనా నా దగ్గర అప్పుతీసుకుని తిరిగి వాపసు చెయ్యటం మరచిపోయినట్లయితే నేనది బ్రతికివున్నంతకాలం జ్ఞాపకం వుంచుకోనడం ఖాయం.

అసలు జరిగిన విషయమేమిటంటే మూడు సంవత్సరాలక్రింతం అంటే యేభయిరెండు-ఏప్రిలు నాలుగో తారీకనుకుంటాను; అనుకోవడమేమిటి నాలుగోతారీకే; పైగా ఆదివారంకూడాను. చిదంబరం హైదరాబాదు వెళుతూ నాదగ్గర యీ అర్ధరూపాయి అప్పుతీసుకున్నాడు. (మనలో మన మాట. యీ మాటలు చిదంబరం చూడటం తటస్థిస్తే ఏమన్నా పనిజరుగవచ్చని తారీఖు వారం కూడా యిచ్చేను.)

ఆవేళ టవున్ స్టేషన్‌కి అతనితో నేనుకూడా వెళ్ళాను సెండ్ ఆఫ్ యిచ్చివద్దామని. నేనుసైకిల్ మీద, తను రిక్షామీద స్టేషన్ చేరేము.

అతను రిక్షాదిగి జేబు తడుముకొంటూ నీదగ్గర యెనిమిదణాలున్నాయా? అన్నాడు నవ్వుతూ "వున్నాయి" అన్నాను. జేబులో వుండగానే లేదనడం యెలాగ? "నాదగ్గర చిల్లరలేదు. రిక్షావాడికియ్యాలి" అన్నాడు.

జేబులోంచి అర్ధరూపాయితీసి తనకిచ్చాను. అదలా రిక్షావాడికిచ్చి పంపించేసి బుక్కింగుదగ్గరకెళ్ళాడు. నేను ప్లాట్‌ఫారం మీదికివచ్చి నుంచున్నాను. అతను టిక్కట్టు తీసుకుని వచ్చాడు. అంతలోనే రైలు ప్లాటుఫారం మీదికి వస్తే, నాతో మాటాడుతూన్న వాడల్లా హడావుడిగా ట్రైన్ యెక్కి నుంచున్నాడు.

రైలు కూతకూసి కదలిపోయింది. నేను జేబురుమాలు వూపి వెనక్కి తిరిగివచ్చాను. అదీ అసలు జరిగిన సంగతి.

అతను నాదగ్గరప్పుడు ఆ అర్థరూపాయి అప్పు తీసుకుంటున్నప్పుడు, తప్పకుండా తిరిగి యిచ్చే వుద్దేశ్యంతోనే పుచ్చుకున్నాడని నాకు గట్టి నమ్మకం కలిగించి అందుచేతే యిచ్చిందికూడా!

హైదరాబాదు వెళ్ళిన తర్వాత రాయల్ హోటలు నుండి ఒక వుత్తరం వ్రాశాడు. వుత్తరం విప్పితే అందులో నా అర్థరూపాయి సంగతి వుంటుందనుకుని భ్రమపడ్డాను. కాని అదేమీ లేదు.

అక్కడ యెండ కొంచెం యిక్కడ కంటె యెక్కువగానే వుంటుందని, కాకినాడలా ఎప్పుడూ నిద్రపోతూ కాకుండా సిటీ అంతా యెప్పుడూ బిజీగా మువ్ అవుతూంటుందనీ, తనున్న రాయల్ హోటల్ సరిగ్గా స్టేషన్‌కి యెదురుగా వుంటుందని, దాని రెండో అంతస్తునుంచి చూస్తే వూరులో కొంతభాగం చక్కగా కనిపిస్తూందని యెదురుగా స్టేషనులోకి వచ్చేపోయే రైలుబళ్ళు యెంతో అందంగా వుంటాయని, నిన్ననే తను చార్ మినార్ చూచివచ్చాడని, రేపు గోల్కొండపోర్ట్ చూడడానికి వెళుతున్నాడని ఏమిటేమిటో యెనిమిది పేజీల గ్రంథం వ్రాశాడు.

కాని ఆ యెనిమిది పేజీలలోనూ నా యెనిమిదణాల సంగతి మాత్రం యెక్కడా లేదు.

మూడు వారాలు గిర్రున తిరిగేయి. తను వస్తున్నానని టెలిగ్రాము యిచ్చేడు చిదంబరం. అతని కోసం స్టేషనుకి వెళ్ళాను.

నా అర్థరూపాయికోసం కాదుకాని, మా యిద్దరి మధ్యనున్న స్నేహాన్నిబట్టి, అతనిపై నాకున్న గౌరవాన్ని బట్టేనీ. అదికాకుండా చాలదూరం వెళ్ళి తిరిగి వస్తున్నాడుకదా స్టేషన్‌లో యెవరైనా యెదురై ఆహ్వానంయిస్తే ఆనందిస్తాడు కదా అని వెళ్ళాను.

"రిక్షా చేసుకొని పోదామా?" అన్నాను.

"కాదు యీ క్రొత్తగావేసిన సిమ్మెంటు రోడ్డు మీంచి సరదాగా నడుద్దాం" అన్నాడు.

ఆ మధ్యాహ్నమంతా హైదరాబాదు గూర్చి చాలసేపు ముచ్చటించుకొన్నాము. అతనితో మాట్లాడుతూన్నానేకాని నా మెదడు మాత్రం నా అర్థరూపాయి గూర్చే తీవ్రంగా ఆలోచిస్తోంది. కాని మొగంమీద ఎలా అడిగేది. సభ్యత అడ్డువచ్చింది. పైగా స్నేహితుడు; నే నెంత మొగమాటం లేనివాడనైనా కుండ బ్రద్దలు కొట్టినట్లు యెలా అడిగేది?

అయినా యీ ప్రస్తావన ఎలాగో ఒకలాగు తీసుకురావడం తప్పదు.

"అక్కడ మన నాణ్యాలే వాడతారా? మనం ఇక్కడ వుపయోగించే రూపాయిలు అర్థలు లాంటివే వాడతారా? మన రూపాయి లక్కడ చెల్లుతాయా?" అని అడిగేను. సాధ్యమైనంతవరకు స్పష్టంగా రూపాయి అన్నమాట గుచ్చిగుచ్చి యెక్కువసార్లు ప్రయోగించాను. కాని లాభం శూన్యం.

అక్కడ మన నాణ్యాలుకూడా చెల్లుతాయని అసలు వాళ్ళ రూపాయికంటె మనదానికి పావలా అర్థణావో యెంతో విలువ యెక్కువ వుంటుందని, అక్కడి బజారులో మన నాణాలతో బేరం చెయ్యడం తమాషాగా వుంటుదని యేవేవో చెప్పాడు. కాని అందులో యెక్కడా నా బాకీ సంగతిలేదు.

తను నాకో అర్థరూపాయి బాకీవున్నాడన్న సంగతి యెత్తటం నా చేతకాలేదు.

చాలాకాలానికి కాని తను పూర్తిగా నా అర్థరూపాయి సంగతి మరచిపోయాడని తెలుసుకోలేకపోయాను. ఆ విషయం గ్రహించడానికి అయిదారు మాసాలు పట్టింది.

మేం రోజూ క్లబ్బులో కలుసుకుంటూనే వుంటాం.

"హైదరాబాదు వెళ్ళిరావడానికి యేమాత్రం అయిందేమిటి?" అని అడిగేనో రోజున యేమైనా పని జరుగుతుందేమోనని.

"ఏమో లెక్కవేయలేద"న్నాడు.

"ప్రయాణం యెలావుంది. దాని బెడదంతా వదలినట్టేనా?" అన్నాను.

"అసలు నాకాప్రయాణం సంగతే గుర్తులేదు" అన్నాడు.

ఇంకా యెక్కడో కొనవూపిరి వున్న ఆ వొక్క ఆశనుకూడా అవతలకి తరిమేయాల్సి వచ్చింది.

నాకు చిదంబరం అంటే పెద్దకోపం ఏమీలేదు. నాదగ్గర మామూలుగా పావలా అర్థా అప్పు

తీసుకుని తిరిగియ్యటం మరచిపోయినవాళ్ళలో అతన్ని కూడా చేర్చేశాను.

వాళ్ళ లిస్టులో పేరు పెరిగింది.

ఇంకా చాలామంది, చాలా చాలామంది వున్నారితరగతి మిత్రులు. కాని నేను వాళ్లెవళ్ళ తోటీయింకోవిధంగా ప్రవర్తించను. అంతా మిత్రుల లాగే స్నేహంగా చరిస్తూంటాము.

కాని నేనుమాత్రం అప్పు సంగతి మరచి పోలేకున్నాను. అది కనుక మరచిపోతే ధన్యుడ ననుకుంటాను.

చిదంబరం తరచు మా యింటికి వస్తూంటాడు. అసలు మేమిద్దరం కలసేతిరుగుతూంటాం. ఎక్కడి కైనా, అంటే యే బీచికైనా, యే సినిమాకైనా వెళ్ళినప్పుడు మేమిద్దరం కలసేవుంటాం.

మొన్న కాఫీ హోటలులో కలుసుకున్నాం.

"రాజారావు బాకీ తీర్చేటట్టు లేడోయి" అన్నాడు చిదంబరం.

రాజారావు మా మిత్రులలో వొకడు; ఎప్పుడూ పనామాసూట్లలో చేతిలో ట్రికాజిల్స్ టిన్నుతో హుషారుగా తిరుగుతూంటాడు నిశ్చింతగా.

ఆ రాజారావు తన బాకీ తీర్చేటట్టు లేడంటూ నాతో చెబుతున్నాడు చిదంబరం. అప్పుడు తిన్నగా చిదంబరం మొగంలోకి చూచాను.

కాస్తయినా సిగ్గు మొగమాటం కనిపించలేదా తని కళ్ళలో.

తన బాకీదారు తన కీయవలసిన బాకీ జ్ఞాపకం వుంచుకొన్న పెద్దమనిషికి తను నాకీయవలసిన అర్ధరూపాయ మాట జ్ఞాపకం వుండొద్దూ?

బాకీ మొత్తం ఎంతయితేమాత్రం బాకీ అన్న తర్వాత బాకీయే. అటువంటి విశేషమేమీ జరుగ లేదు.

ఈలోగా నా మెదడులో ఒక ఆలోచన వ్యథ కలిగించే ఆలోచన అప్పుడప్పుడూ ప్రవేశించి కల వరపెట్టసాగింది.

చిదంబరం నావద్ద వొక అర్ధరూపాయి అప్పు తీసుకొని మరచిపోయాడుగదా! అలాగ నేను ఎవరివద్దనైనా, అప్పు పుచ్చుకుని తిరిగియ్యటం మరచిపోయానేమో!

ఎంతమందివద్ద పుచ్చుకొని మరచిపోయానో— ఆలోచించగా నాకీ ఆలోచన నచ్చలేదు.

ఎందుచేతనంటే నే నెవరివద్దనైనా రూపాయి అప్పుతీసుకుని మరచిపోయానంటే నిజంగా చచ్చినా తిరిగియ్యడం సంభవించదు.

నే నెవరికన్నా బాకీ వుంటే వాళ్లు వచ్చి స్పష్టంగా నిర్మొహమాటంగా అడిగెయ్యటం మంచిది.

అందరూ ఒక్కసారిగా కాకపోయినా ఒకరి తర్వాత వొకరు రావటం మంచిది.

వీలయితే అకారాదినామసూచిక తయారు చేసుకొంటాను.

అప్పుడప్పుడు బ్రిడ్జి ఆటలో రూపాయి అర్ధా యిచ్చిన వాళ్ళమాటకాదు నేను చెప్పేది. మొన్న ఉడిపి హోటలులో ద్రాక్ష త్రాగినపుడు నావంతు పావలా బిల్లుకూడా చెల్లించిన మిత్రుని మాట కాదు నే చెప్పేది.

నేనెక్కడికైనా బయలుదేరుతూ, దగ్గర చిల్లర లేదని నాకొక అర్ధ రూపాయి అప్పు కావాలి రిక్షావాడి కియ్యాలంటూ ఎవరిదగ్గరైనా తీసు కున్నట్లయితే తిరిగియ్యటం మరచిపోయివున్నట్ల యితే, వారందరికీ తిరిగి వాపసు చెయ్యగలందులకు సంసిద్ధంగా వున్నాను.

అంతేకాదు—

ఇంకా వున్నాయి. అత్యవసర వేళలలో, అప్పుగా తీసుకొన్న, రూపాయి, అర్ధ, అణా కాని, యేదైనా సరే అప్పుగా తీసుకొన్నదానిని అణా పైసలతో తిరిగియ్యడానికి సిద్ధంగావున్నాను.

వీలైతే యిలాంటి ఒక మహోద్యమం లేవదీయ డానికి నేనేమీ సందేహించను.

అట్టి మహత్తరోద్యమానికి నాయకత్వం వహించడానికి వెనుదీయను.

పెద్దపెద్ద వాళ్ళందరూ యీ సూత్రంమీదేగా పైకివచ్చింది.

ఇంకొక్క ముఖ్యవిషయం.

ఈ స్కెచ్ చూచిన వాళ్ళవరైనా దీన్ని హేపీక్లబ్బుకి చెందిన ప్రెసిడెంట్ చిదంబరానికి అందేలా అశ్రద్ధగా వదిలెయ్యకండేం!

(స్టీవెన్ లీకాక్ ఆధారంగా)